క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



సరస్వతికండ్రిగ ఎన్నికల ప్రచారంలో నాయకులు

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని సరస్వతికండ్రిగ, ముసలిపేడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన చేశారని తెలిపారు. పథకాల అమలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు రెండు సార్లు బటన్ నొక్కి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, బీసీసెల్ శ్రీకాళహస్తి నియోజక వర్గ ప్రధా న కార్యదర్శి శ్రీమంతుల రామయ్య ఆచారి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, నాయకులు అయోధ్య, చల్లా సుబ్రమణ్యం, గోపీ యాదవ్, మైరావణ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శ్రీఅభయాంజనేయ సహిత శ్రీ కోదండ రామాలయంలో సోమవారం రాత్రి సీతారాముల పరిణయోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ సీఎస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించి తరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదానం చేశారు.

రెయిన్‌బో విద్యార్థిని ప్రతిభ



ప్రణతి

ఏర్పేడు: రేణిగుంటలోని రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని ప్రణతి పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పీఏఖాన్ మంగళవారం తెలిపారు. పాఠశాలలోని 77 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించి, వంద శాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం చాటారని పేర్కొన్నారు. ప్రణతి 600లకు 592 మార్కులు సాధించిందని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

వేధింపులతో రాజీనామా

నాగలాపురం: మండలంలోని టీపీకోట పంచాయతీ వలంటీర్లు ఇద్దరు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మంగళవారం ఉదయం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పీఎంకె బాబుకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నీచమైన వ్యాఖ్యలను నిరసిస్తూ రాజీనామా చేసినట్లు తెలిపారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలోని వేలూరుకు చెందిన మరో ఇద్దరు వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. వేలూరు దళితవాడకు చెందిన ఆర్. శ్రీనివాసులు, డి.సతీష్‌కుమార్ రాజీనామా చేస్తూ లేఖను ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అండ్‌కో దిగజారుడు వ్యాఖ్యలను నిరసిస్తూ రాజీనామా చేసినట్లు తెలిపారు.

విషం చిమ్మిన 'పచ్చ' గడ్డి



శ్రీకాళహస్తి: 'బుద్ధి గడ్డి తినింది.. పచ్చగడ్డిలోను అవినీతి మేత' అంటూ శ్రీకాళహస్తి ఆలయంపై ఈనాడులో ప్రచురితమైన అసత్య కథనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అసలు విషయంలోకి వెళితే.. గతంలో ఆలయం తరుపున పచ్చగడ్డి భక్తులకు విక్రయించేవారు. సంవత్సరానికి రూ.ఒకటిన్నర లక్ష మాత్రమే ఆదాయం వచ్చేది. అందుకోసం నలుగురు సిబ్బంది జీతాలు, గడ్డి కొనుగోలు వంటివి చూసుకుంటే అంతకంటే ఎక్కువ ఖర్చు కావడంతో ఆలయానికి భారంగా మారింది. దాంతో టెండర్ ప్రక్రియకు వెళ్లి ఆన్‌లైన్ టెండర్, బహిరంగ వేలం ద్వారా గడ్డి విక్రయాలు కేటాయించాలనుకున్నారు. గత ఏడాది జూన్‌లో టెండర్ పిలిచి ఎక్కువ కోట్ చేసిన టెండరు దారుడికి గడ్డి విక్రయించుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు టెండరుదారుడు రంగుల గోపురం వద్ద, సప్త గోకులం, దక్షిణ గోపురం వద్ద మరో రెండు గోవు దూడలను ఏర్పాటు చేసి గోపూజ ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చే భక్తులకు టెండర్ దారుడు దేవస్థానం ప్రకటించిన ధరలకే గడ్డి విక్రయాలు చేస్తున్నారు. సప్త గోకులం దక్షిణ గోపురం వద్ద ఉన్న గోవులు మొత్తం కలిపి 9 మాత్రమే ఉన్నాయి. ఒక్కో గోవు 20 నుంచి 30 కట్టలు చొప్పున మాత్రమే తినగలుగుతాయి. 750 కట్టలు గోవులు తిన్నట్టుగా ఈనాడు తప్పుడు కథనాలు ప్రచురించింది. 250 కట్టలకు గాను కట్టకు రూ.20 లెక్కన రూ.5వేల అమ్మకాలు సాధ్యమవుతాయి. ఇందులో గడ్డి కొనుగోలుకు రూ.2వేలు, జీతభత్యాలకు రూ.900, ఆలయానికి చెల్లింపులు రూ.900 పోనూ మిగిలేది రోజుకు రూ.1200 లెక్కన నెలకు 36వేలు, సంవత్సరానికి సుమారు 4,32,000 ఆదాయం వస్తుండగా, ఈనాడులో రూ.అర కోటి ఆదాయం వస్తుందంటూ అసత్య కథనం ప్రచురితం చేశారు. గోవుల రొటేషన్ ఉండడం వల్ల ఆజీర్తి వచ్చే అవకాశం లేదని ఆలయ గోశాల సిబ్బంది తెలిపారు.

సత్యవేడులో సమరోత్సాహం





వైఎస్సార్ సీపీ సత్యవేడు అభ్యర్థి నూకతోటి రాజేష్ నామినేషన్ ర్యాలీకి తరలివచ్చిన అశేష జనం, మాట్లాడుతున్న రాజేష్, పక్కన ఎంపీ గురుమూర్తి

- జనసంద్రమైన సత్యవేడు
- నూకతోటి రాజేష్ నామినేషన్ ర్యాలీకి తరలివచ్చిన జనవాహిని
- దారులన్నీ సత్యవేడు వైపే
- వైఎస్సార్‌సీపీలో జోష్

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల నామినేష్ ర్యాలీ పార్టీలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావడంతో పట్టణం జనసంద్రమైంది. పట్టణంలో జన జాతరగా మారింది. వీధులు, రహదారులు జనసంద్రమయ్యాయి. తొలుత నూకతోటి రాజేష్, సతీమణి చైతన్య భాను కుటుంబ సభ్యులతో కలసి శ్రీఆంజనేయస్వామి, శ్రీసాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉదయం 9గంటల నుంచే సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. దారులన్నీ సత్యవేడు వైపు చూడడంతో ఎటు చూసినా వాహనాలు, ప్రజలు బారులు తీరారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ నామినేషన్ కార్యక్రమం జరిగిందని సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ప్రజలు నిర్ధారణకు వచ్చారు. మండుటెండను లెక్కచేయకుండా మహిళలు పార్టీ జండాలతో పెద్దిరెడ్డికి జై.. జగనన్నకు జైజై.. గురుమూర్తికి జై.. రాజేష్‌కు జైజై అంటూ నినాదాలు చేశారు.

ముందే వచ్చిన జాతర

సత్యవేడులో మే 29న నిర్వహించే గంగమ్మ జాతర రాజేష్ నామినేషన్ పర్వంతో ముందే వచ్చిందని ప్రజలు చర్చించుకొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ముఖ్య అతిథులుగా హాజరు కావడం, భారీ ర్యాలీలో పార్టీ శ్రేణుల ఉత్సాహం ఒక్కసారిగా వెల్లివిరిసింది. దీంతో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇదే ఉత్సాహంతో గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి జిల్లాలోనే నూకతోటి రాజేష్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

హోరెత్తిన నూకతోటి ప్రచారం

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం తొలిసారిగా నియోజకవర్గ ఈశాన్య ప్రాంతమైన చిలమత్తూరు గ్రామ పంచాయతీలో ఎంపీ గురుమూర్తితో కలసి నూకతోటి రాజేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఈ సందర్భంగా చిలమత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కన్వీనర్ భాస్కర్ రెడ్డి, ఆయన కుమార్తె డాక్టర్ శాంతనసిరిల ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ ప్రజలతో కలసి గుమ్మడికాయల దిష్టి, ఎర్రనీళ్ల హారతులు, బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని ప్రజలతో మమేకమయ్యారు. స్థానికంగా నెలకొన్న తాగునీటి సమస్య, గ్రామంలో పాడి పశువులు ఎక్కువగా ఉండడంతో పశు వైద్యశాల ఏర్పాటు వంటి సమస్యలు ఎంపీ దృష్టికి రావడంతో ఆయన స్పందించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మీలో ఒకడిగా ఉంటా..

రాజేష్ స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మీలో ఒక్కడిగా అందుబాటులో ఉంటానని, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, అందరి సమన్వయంతో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, సీనియర్ నేత భానుప్రకాష్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్రభాకర్, విజయ్, శంకర్, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, బీసీ సెల్ కన్వీనర్ శేఖర్ యాదవ్, గిరిరెడ్డి, శీను రెడ్డి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

ప్రజలే జగనన్న ప్రచారాస్త్రాలు



రేణిగుంట ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- రేణిగుంట మండలంలోనే నాకు అత్యధిక మెజారిటీ
- ప్రచారంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులే జగనన్నకు ప్రచారాస్త్రాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణంలో మంగళవారం ఉదయం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకే ఆయన రేణిగుంటకు చేరుకున్నారు. వేణుగోపాలపురం సమీపంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వాద పాదయాత్ర ప్రచారాన్ని ప్రారంభించారు. వేణుగోపాలపురం, శివకుమార్‌నగర్, వడ్డిమిట్ట, పాంచాలీనగర్‌లో ఆశీర్వాద పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రజలకు అభివాదం చేస్తూ మరోసారి తనకు ఓటువేసి ఆశీర్వదించాలని ఆయన వేడుకున్నారు. నాలుగున్నరేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగనన్న ఛరిష్మా, నియోజకవర్గ ప్రజల మద్దతుతో 40వేల ఓట్ల మెజారిటీతో గెలిచానని గుర్తు చేసుకున్నారు. గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల కష్ట,సుఖాల్లో తోడుగా ఉంటున్నానని తెలిపారు. కరోనా కష్టకాలంలో బొజ్జల కుటుంబం ప్రాణభయంతో పక్కరాష్ట్రంలో దాక్కుందని, తాను, తన బిడ్డ పవిత్రారెడ్డి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే శ్రీరామరక్షగా రూ.కోట్ల నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శ్రీకాళహస్తిని 30 ఏళ్లు పాలించిన వారు నియోజకవర్గ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా కేవలం వారి సొంత వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్‌లో తిష్ట వేసి ప్రజలకు అందుబాటులో లేకుండా నరకం చూపారన్నారు. గత ఎన్నికల్లో తనను ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గతంలో ఎన్నడూ జరగని రీతిలో అభివృద్ధిని చేసి చూపానన్నారు. రేణిగుంటపై తన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధికి బాటలు వేసిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 2024 జూన్ 4వ తేదీన తర్వాత టీడీపీ అభ్యర్థి ఓటమిపాలై సిమ్ కార్డు స్వర్ణముఖి నదిలో పడేసి హైదరాబాద్‌కు వెళ్లిపోవడం ఖాయమని విమర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సి.తిరుమలరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ముఖ్య నేతలు పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, వైస్ ఎంపీపీ సుజాత, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్, ఖదీర్, రఫీ, మిథున్‌శాలీ, షబ్బీర్, ఇరానీ ఖాదర్, రమణ, బాలా, నాగరాజు, సుందరమూర్తి, ఈశ్వరి, ఉప్పు రమణ, ఈశ్వరి, కృష్ణమూర్తి, చైతన్య, మహబూబ్ బాష, మస్తాన్, ఇర్ఫాన్, రిజ్వాన్, ఇన్ప, మరియమ్మ, పద్మావతి, ఇందిరమ్మ, మల్లి, జగదీశ్వరి, శ్రావణి, ఒడ్డిమిట్ట రమణ, శ్రీకాంత్, గిరి,జాన్‌బాబు, నరేష్, హసన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

టెన్త్ ప్రతిభావంతులకు అభినందన



శ్రీకాళహస్తి : జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న ఎంఈఓ



శ్రీకాళహస్తి : పదవ తరగతిలో ప్రతిభ చూపిన ఎంజీఎం విద్యార్థులు


శ్రీకాళహస్తి: పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో మొదటి మూడుస్థానాలు సాధించిన నీలిమ(588), సీహెచ్.గణేష్(580), ఆర్. హిమసాగర్(579)ను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఎంఈవోబాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. హెచ్‌ఎం రాజేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా ఎంజీఎంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్ గూడ్లూరు మయూర్ ఘనంగా సన్మానించి అభినందించారు. హెచ్‌ఎం మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు అభినందనలు


ఏర్పేడు: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బండారుపల్లి జననిని మంగళవారం ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఎంఈఓ–2 దయాకర్ మాట్లాడుతూ జనని 600 గాను 592 మార్కులు సాధించి మండల టాపర్ నిలిచిందన్నారు. అనంతరం శాలువలతో సన్మానించి మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. హెచ్‌ఎం నిర్మల్‌కుమార్, ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, సీఆర్పీ వెంకటముని పాల్గొన్నారు.

పుదుకుప్పం తమిళ పాఠశాలలో..

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పం తమిళ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ విశ్వ(478,), జీవిత(467), ఎస్ షణ్ముగరాజన్(467), వి.కృత్తిక(461)ను అభినందించారు. హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, జగదీష్, శివలింగం, జయంతి, గ్రేస్ ప్రతిమ, ఏకాంబరం, గ్రేస్‌మేరి, మునిబాల, పాండియన్ పాల్గొన్నారు.



ఏర్పేడు : జననికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈఓ



సత్యవేడు: విద్యార్థులకు అభినందన

నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

శ్రీకాళహస్తి : నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, సీఎం జగనన్న పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చగలిగారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కలవగుంట పంచాయతీ పరిధిలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి అందిందని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30 ఏళ్ల ప్రగతిని నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసి చూపించారని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో కొందరు నాయకులు ఎక్కడో హైదరాబాదులో తలదాచుకుంటే ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్న వ్యక్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, సుబ్బరామిరెడ్డి, దేవరెడ్డి, ప్రతాప్‌రాజు, శివరామరాజు, రవిచంద్రరాజు, మునిరాజు, పెంచలయ్య, నరసింహులు, మనోహర్‌రెడ్డి, మునిరత్నం, రేపల్లె మల్లి, ఢిల్లీబాబు, వెంకటేశ్వర్‌రాజు, గోపాల్‌రాజు, శ్రీనివాసరాజు, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.



కలవగుంటలో ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

శ్రీకాళహస్తి : వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం ఆయన శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సైతం గత ఐదేళ్లుగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవ చేసినట్లు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. పార్టీ నాయకులు వెంకటాద్రి, దాము, శ్రీను, మూర్తి, మస్తాన్, దేవిప్రసాద్, విజయ్, కిశోర్, మురళి, చెంచురామయ్య, సురేంద్ర, హరి, ప్రతాప్, సుధ, మధు, చెంచయ్య, కోటి, తదితరులు పాల్గొన్నారు.



కుంటిపూడిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ముత్యాలమ్మా .. పాహిమాం



సారె అందజేస్తున్న ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు



గెరిగ ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీముత్యాలమ్మ ఆలయ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులు జరిగే ఈ జాతరలో మొదటి రోజు మంగళవారం గెరిగ ఉత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. మొదట ఆలయంలోని శ్రీవినాయకస్వామి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీముత్యాలమ్మ అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. ఉదయం మైలు, ముగ్గు, రాత్రి శేషపాన్పు ముగ్గు వేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పుల చప్పుళ్ల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అర్చకులు పోతురాజు, గెరిగకు పూజలు నిర్వహించి ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. చలువ పందిళ్లు, విద్యుద్దీపాలం కరణలతో ఆలయాన్ని శోభాయమానంగా దర్శనమిస్తోంది. ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

వైఎస్సార్‌సీపీతోనే ముస్లిం అభ్యున్నతి



మాట్లాడుతున్న మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి సాధ్యపడిందని మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్‌బాషా తెలిపారు. పట్టణంలోని కైకాలవారి సత్రంలో మంగళవారం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా ఆధ్వర్యంలో మైనారిటీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ముస్లింలకు ఎన్నడూ లేని విధంగా పలు పదవులు వచ్చాయని చెప్పారు. ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని, ఎంపీగా గురుమూర్తిని మరోసారి ఆదరించాలని కోరారు. మైనారిటీ సెల్ రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్ షఫిఅహ్మద్ ఖాదరి, నాయకులు మహబూబ్‌బాషా, పఠాన్ ఫరీద్, ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.